13న అరసవల్లి హంసనావికోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 13న హంసనావికోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ ఇఒ యర్రంశెట్టి భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఒక ప్రకటనలో తెలిపారు. క్షీరాబ్ధి ద్వాదశి సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా సాగే ఈ ఉత్సవాలకు వేలాదిగా సందర్శకులు తరలివస్తుంటారని, ఈ ఏడాదీ అదేస్థాయిలో యాత్రికులు హాజరు కానున్నట్టు తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ఈ ఉత్సవం ప్రారంభమవుతుందన్నారు. ఆలయానికి ఎదురుగా ఉన్న ఇంద్ర పుష్కరిణిలో సాగే ఈ వేడుక రాత్రి 7 గంటల వరకు కొనసాగుతుందన్నారు. అందు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు.

అన్నదాతకు అండగా..

అన్నదాతకు ఏ కష్టం వచ్చినా ఎపి రైతు సంఘం వారి వెంట నిలిచి పోరాడింది. సాగునీటి సమస్యలు, కరువు పరిస్థితులు తలెత్తిన ప్రతి సందర్భంలోనూ వారికి అండగా నిలిచింది. పొలం పిలుస్తోంది, సాగునీటి గట్లపై రాత్రి నిద్ర వంటి పేర్లతో పాలకులు హడావుడి చేసినా రైతు సంఘం మాత్రం పొలాలు, సాగునీటి కాలువ గట్ల వెంబడి తిరుగుతూ రైతుల సమస్యలను తెలుసుకునే ప్రయత్నం చేసింది. ఎత్తిపోతల పథకాలు పూర్తికాక, షట్టర్ల లేక రైతులు పడుతున్న ఇబ్బందులను అనేక సార్లు పాలకులు దృష్టికి తీసుకువెళ్లింది. నిరుపయోగంగా ఉన్న భూములను సాగులోకి తీసుకువచ్చేందుకు అనేక ప్రత్యామ్నాయాలు చూపింది. నేరడి బ్యారేజి పూర్తి, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి నిధులు కేటాయించాలని అనేక పర్యాయాలు సిపిఎం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

సోంపేట మండలం పైడిగాం ప్రాజెక్టును పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు, తదితరులు (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించకపోవడంతో ఏటా రైతులకు కష్టాలు తప్పడం లేదు. వంశధార స్టేజ్-2 ఫేజ్-2, ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు ఏళ్ల తరబడి అసంపూర్తిగానే ఉన్నాయి. కనీసం అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, రిజర్వాయర్లతోనైనా సాగు నీరందిస్తున్నారా? అంటే అదీ లేదు. హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడికాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందివ్వాల్సి ఉంది. కాలువల నిర్మాణం చేపట్టి దశాబ్దాలు గడుస్తుండటంతో కాలువ గట్లు బలహీనంగా మారాయి. పదేళ్లుగా వీటిలోని ఏ కాలువ ద్వారా పూర్తిస్థాయి నీరందని పరిస్థితి నెలకొంది. వంశధార ఆధునికీకరణకు అనేకసార్లు అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా ఏ ప్రభుత్వమూ వాటికి క్లియరెన్స్ ఇవ్వలేదు. మరోవైపు రెండు కాలువల్లో అడగడుగునా పెద్ద ఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోతుండటంతో శివారు భూములకు సాగునీరందని పరిస్థితి ప్రతి ఏడాదీ తటస్థిస్తోంది.

సాగునీటి సమస్యలపై అలుపెరుగని పోరు

సాగునీటి సమస్యలపై ఎపి రైతు సంఘం అనేక ఆందోళనలు చేపట్టింది. 2023 జూలై ఖరీఫ్‌లో టెక్కలి నుంచి వజ్రపుకొత్తూరు ఉన్న వంశధార ఎడమ కాలువను పరిశీలించి టెక్కలి నీటిపారుదలశాఖ అధికారులకు వినతిపత్రం అందించారు. ఆఫ్‌షోర్‌ను పూర్తి చేసి తాగు, సాగు నీరు ఇవ్వాలని, నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలంటూ టెక్కలి సబ్‌కలెక్టరేట్ వద్ద ఈ ఏడాది ఫిబ్రవరిలో నిరసన చేపట్టారు. 2023 జూన్‌లో ఎచ్చెర్ల మండలం నవభారత్ కూడలి, ఫరీద్‌పేట ప్రాంతాల్లో రైతులతో కలిసి నారాయణపురం కాలువపై పాదయాత్ర చేపట్టింది. ఈ ఏడాది ఆగస్టులో సోంపేట మండలంలో సిపిఎం నాయకులు పైడిగాం ప్రాజెక్టును సందర్శించి వెంటనే పూర్తిచేయాలని ప్రభుత్వం ముందు డిమాండ్ ఉంచారు. కోటబొమ్మాళిలోని చిన్నసానతో పాటు పలు ఎత్తిపోతల పథకాలను పరిశీలించి వాటిని పూర్తి చేయాలంటూ ప్రభుత్వంపై వివిధ రూపాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేశారు.

- సాగునీటి సమస్యలపై నిరంతర పోరు
- జీడి మద్దతుకు అలుపెరుగని పోరు
- సాగుకు అనేక ప్రత్యామ్నాయాలు చూపిన వైనం
- రైతాంగ పోరాటాలకు మద్దతుగా నిలిచిన సిపిఎం

నారాయణపురం రైతులకు అండగా

ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని నారాయణపురం భూముల అంశంపై రైతులతో కలిసి ఎపి రైతు సంఘం చేసిన పోరాటాలకు సిపిఎం అడుగడుగునా అండగా నిలిచింది. ఎచ్చెర్ల మండలం నారాయణపురం కొండపై ఉన్న సుమారు 170 ఎకరాల్లో చిలకపాలెంకు చెందిన దళితులు, నిరుపేదలు తరాతరాలుగా తరబడి జీడి, నీలగిరి, నేరడి తదితర పంటలను సాగు చేసుకుంటున్నారు. ఈ భూములు తమవే అని చెప్పుకుంటున్న వ్యాపారులు, రాజకీయపార్టీల నేతలు, అధికారులు కుమ్మక్కై వారిని భూముల నుంచి దూరం చేసేందుకు రకరకాల ప్రయత్నాలు చేశారు. అన్యాయానికి గురైన రైతుల పక్షాన సిపిఎం నిలిచింది. రిలే నిరాహార దీక్షలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద వారి ఆందోళనలకు మద్దతు పలికింది. రైతులకు సంఘీభావంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర నాయకులు పి.మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ ఆ గ్రామంలో పర్యటించి వారికి భరోసా కలిగించారు.

జీడికి మద్దతుపై పోరు

ఎపి రైతు సంఘం సాగించిన పోరాటాల్లో జీడి పిక్కలకు మద్దతు ధర అతి ముఖ్యమైన అంశంగా ఉంది. వైసిపి ప్రభుత్వం హయాంలో 2021 నుంచి ఇప్పటివరకు జీడికి మద్దతు ధరపై అతన గొంతును వినిపిస్తూనే ఉంది. జీడి పిక్కలకు 80 కేజీల బస్తాకు రూ.16 వేలు చెల్లించడంతో పాటు ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలంటూ నినదించింది. జీడి పిక్కల అంశాన్ని పాలక, ప్రతిపక్ష పార్టీలకు అజెండాగా మార్చింది. రైతులు సాగించిన ఆందోళనల ఫలితంగానే వారితో ప్రభుత్వం చర్చలు జరపడం, మద్ధతు ధరపై ఒక నిర్ణయం తీసుకునేలా చేశాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలాసకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకుంటామని చెప్పేలా రైతుల పోరాటం పని చేసింది. రైతుల పోరాటాలకు బాసటగా నిలవడంతో పాటు వారికి చైతన్యం కల్పించడంలో సిపిఎం చురుకైన పాత్ర పోషించింది.

ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విఆర్‌ఎల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తిలు హెచ్చరించారు. నగరంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి కలెక్టరేటు వరకు విఆర్‌ఎలు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విఆర్‌ఎలపై నిబంధనలకు విరుద్ధంగా మోపిన నైట్ వాచ్‌మెన్, రైస్‌మిల్లుల డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణాలో అమలవుతున్న విధంగా పేస్కేల్ అమలు చేయాలన్నారు. అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ తదితర పోస్టులు అర్హులైన విఆర్‌ఎలతో భర్తీ చేయాలన్నారు. నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా, నిబంధనలకు విరుద్ధంగా విఆర్‌ఎలకు నైట్ వాచ్‌మెన్‌లుగా, రైసు మిల్లుల వద్ద డ్యూటీలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం టిఎ, డిఎలు చెల్లించకుండా ఎనిమిదేళ్లుగా రూ.10,500 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో కుటుంబ పోషణ కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఉద్యోగోన్నతులు ప్రక్రియ ప్రారంభించి ఇంటర్మీడియట్‌ను విద్యార్హతగా నిర్ణయించాలన్నారు. కార్యక్రమంలో ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా నాయకులు ఎన్.సీతప్పుడు, డి.అప్పారావు, కె.పురుషోత్తం, బి.రాములమ్మ, సన్యాసమ్మ, మీనాక్షి, రఘు, రాజారావు, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, జనార్ధనరావు పాల్గొన్నారు. అనంతరం మీకోసంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందజేశారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి హరీష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించే వరకు విద్యార్థులపై కళాశాలల యాజమాన్యలు ఫీజుల కోసం ఒత్తిడి లేకుండా ఆదేశాలు ఇవ్వాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా విద్యా దీవెన, వసతి దీవెన పథకాలకు 50,956 మంది విద్యార్థులు అర్హులని తెలిపారు. వారికి రూ.105 కోట్ల మేర నిధులు విడుదల చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటి వరకు విడుదల చేయకుండా పెండింగ్‌లో ఉంచడం సరికాదన్నారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2023-24 విద్యాసంవత్సరానికి విద్యార్థుల ఫీజు రీయంబార్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో ఫీజులు కట్టుకోలేని దుస్థితి నెలకొని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వైపు కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఫీజుల కోసం ఒత్తిడి వల్ల విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఫీజులు కట్టకపోతే పరీక్ష ఫీజులు కట్టించుకోబోమని కళాశాల యాజమాన్యం విద్యార్థులను బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే కలెక్టర్ జోక్యం చేసుకుని విద్యార్థులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సంఘీభావం తెలిపారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు ఏ కష్టం రానీయకుండా మాజీ సిఎం జగన్ విద్యా పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. వాటిని కూటమి ప్రభుత్వం పునరుద్ధరించి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ పి.పవిత్ర, నాయకులు నగేష్, చెన్నారావు, సింహాద్రి, జీవిత డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- ప్రోటోకాల్ ఉల్లంఘనపై మాజీ మంత్రి ఫిర్యాదు
- 'మీకోసం'లో 204 వినతులు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం ఏర్పాటు చేస్తున్న శిలాఫలకాలపై కూటమి ప్రభుత్వం స్థానిక ప్రజాప్రతినిధుల పేర్లు లేకుండా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని, ఇది ముమ్మాటికి ప్రోటోకాల్ ఉల్లంఘనే అవుతుందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ఈ మేరకు జెడ్‌పిలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే విధంగా ఏ ఒక్కరూ వ్యవహరించినా సమగ్ర విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని కోరారు. అధికారం శాశ్వతం కాదని, అధికారులు గుర్తెరిగి వ్యవహరించాలని సూచించారు. ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడే వారిపై చర్య తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి 204 వినతులను కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, జిల్లా పరిషత్ సిఇఒ శ్రీధర్‌రాజు, ఉప కలెక్టర్ అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ కిషోర్‌కుమార్‌లు స్వీకరించారు. నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య కార్మికురాలిగా రెగ్యులర్ ప్రాతిపదికన పని చేసిన తులసమ్మ పన్నెండేళ్ల క్రితం మృతి చెందింది. ఆమె కుమార్తె ఒంటరి మహిళగా జీవనాన్ని కొనసాగిస్తోంది. గడచిన పన్నెండేళ్లుగా ఆమెకు రావాల్సిన గ్రాడ్యుటీ, ఇతర అలవెన్స్‌లు, పరిహారం అందక కాళ్లు అరిగేలా తిరుగుతున్నట్టు రెల్లి వీధికి చెందిన బాధితురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. నగరపాలక సంస్థ సిబ్బందికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. గార మండలం వమ్మరవెల్లికి చెందిన జానకమ్మ పితృస్వామ్యంగా సంక్రమించిన తన భూములను రీసర్వే సమయంలో వేరొకరి పేరుతో రెవెన్యూ అధికారులు మార్చేశారని, తప్పులను సరిదిద్ది పాసుపుస్తకాలను మంజూరు చేయాలని కోరింది. రాగోలు పరిసరాల్లో అనేక భూ ఆక్రమణలు ఉన్నాయని, ప్రభుత్వ భూములు సైతం అన్యాక్రాంతమయ్యాయని బి.శివశంకర్ ఫిర్యాదు చేశారు. భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టాలని విన్నవించారు. తండ్యాంవలస వద్ద నిర్మించిన జగనన్న కాలనీ సమీపాన డంపింగ్ యార్డును తొలగించాలని కోరుతూ పలువురు మహిళలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సామాజిక, వ్యక్తిగత అవసరాలను తీర్చాలంటూ పలువురు ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో డిపిఒ కె.భారతీసౌజన్య, డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి.ప్రసాదరావు, బిసి కార్పొరేషన్ ఇడి గెడ్డెమ్మ, ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతిశ్రీ, డ్వామా పీడీ బి.సుధాకరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణబాబు, కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ బాధ్యతారాహిత్యం

మాజీ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం నవంబరు 1న చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మరవడం బాధాకరమని, ఇది ప్రభుత్వ బాధ్యతారాహిత్యమని మాజీ స్పీకర్, వైసిపి పార్లమెంటరీ పరిశీలికులు తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున జిల్లా కేంద్రంలో, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసేందుకు నాయకులు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీల్లో తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అని చెప్పి, తీరా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పథకానికి తూట్లు పొడిచారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కోటీ 50 లక్షల మంది లబ్ధిదారులకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామన్న ప్రభుత్వం, కేవలం కోటి మందికే పరిమితం చేసి మిగిలిన 50 లక్షల మందికి ఎగనామం పెట్టడం దారుణమన్నారు. లబ్ధిదారులందరికీ ఉచిత గ్యాస్ ఇవ్వాలంటే రూ.1345 కోట్లు అవసరమని, బడ్జెట్‌లో కేవలం రూ.895 కోట్లు మాత్రమే కేటాయించడం ద్వారా ప్రభుత్వం ఆలోచన తేట తెల్లమైందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, గత నాలుగు నెలల్లో ఎక్కడ చూసినా అఘాయిత్యాలు జరుగుతున్నాయని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం పోయి రెడ్‌బుక్ రాజ్యాంగం రాష్ట్రంలో రాజ్యమేలుతుందన్నారు. నంద్యాల జిల్లాలో ఎనిమిదేళ్ల బాలిక హత్య, వైఎస్‌ఆర్ జిల్లాలో యువతపై లైంగిక దాడి అనంతరం పెట్రోల్ పోసి తగలబెట్టడం, గుంటూరు జిల్లాలో యువతిపై అత్యాచారం, ఇటీవల పలాసలో ఇద్దరు బాలికలపై లైంగిక దాడులు వంటివి రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని అనడానికి నిదర్శనమన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని జిల్లా అదనపు పర్యవేక్షణ అధికారి బి.వి.రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బాలల సంరక్షణ కేంద్రాలు నడుపుతున్న సంస్థలకు, వ్యక్తులకు జువెనైల్ జస్టిస్ (పిల్లల సంరక్షణ, రక్షణ) చట్టం 2015, సవరించిన చట్టం 2021లోని సెక్షన్ 41 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సంచాలకులు, బాలల సంక్షేమయ, సంస్కరణల సేవలశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత నెల 22న స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. బాలల సంరక్షణ కేంద్రాలుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకున్న వారు నిర్దేశించిన ప్రొఫార్మాలో నింపబడిన దరఖాస్తుతో పాటు, అన్ని కాపీలు జతచేసిన దరఖాస్తును ఈ నెల 11లోగా సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధిబాలల సంక్షేమశాఖ, విజయవాడ, కార్యాలయానికి పంపించాలన్నారు. దీనికి సంబంధించిన పూర్తి నోటిఫికేషన్, చిరునామా, అర్హతలు, జాతపరచాల్సిన డాక్యుమెంట్లు చెక్ లిస్టులు తదితర http://wdcw.ap.gov.in అనే వెబ్ సైటు పొందవచ్చునని చెప్పారు. దరఖాస్తులను స్పీడ్ పోస్టు, రిజిస్టర్ పోస్టు ద్వారా, సాఫ్ట్ కాపీలను cci.reg2024@gmail.comకి మెయిల్ ద్వారా రెండింటిని కచ్చితంగా పంపాలని స్పష్టం చేశారు. తదుపరి సమాచారం కోసం శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి బి.వి.రవికుమార్ అదనపు జిల్లా పర్యవేక్షణ అధికారి 9100045398, కె.వి.రమణ, జిల్లా బాలల సంరక్షణ అధికారి 9440035576ని సంప్రదించాలని సూచించారు.

వేరుశనగ విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో ఈ ఏడాదిలో రబీలో పంట సాగు చేసే రైతుల కోసం సబ్సిడీ వేరుశనగ విత్తనాలు సిద్ధం చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సీజనుకు రైతు సేవా కేంద్రాల్లో అధిక దిగుబడినిచ్చే వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఈ సీజనుకు అనువైన కె-6, టిసిజిఎస్ 1694 (విశిష్ట) అనే రకాల విత్తనాలు సరఫరా చేయడానికి ఒక కిలో విత్తనానికి పూర్తి ధర రూ.98 నిర్ణయించినట్లు, అందులో 40 శాతం రాయితీ (రూ.38-40లు) పోను, రైతు చెల్లించవలసింది రూ.57-60గా ఉన్నట్లు స్పష్టం చేశారు. జిల్లాకు సంబంధించి 4533 క్వింటాళ్లు వేరుశనగ విత్తనాలు కేటాయించామన్నారు. ఇందులో భాగంగా 4518 క్వింటాళ్లు రైతు సేవ కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉంచినట్లు వివరించారు. విత్తనాలు కావలసిన రైతులు రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు. జిల్లాకు సంబంధించి 4533 క్వింటాళ్ల వేరుశనగ విత్తనములు రూ.1,73,50,272 రాయితీతో సరఫరాకు సిద్ధం చేశామన్నారు. సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉన్నందున జిల్లాకు అదనంగా మరో 2000 క్వింటాళ్ళ కేటాయించమని ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. నీటి సదుపాయం ఉన్న ప్రాంతాల్లో రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకొని అన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తూ వేరుశనగ పంటలో సాగు చేసి అధిక దిగుబడి సాధించాలని అన్నారు.

సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనాలు

ఉపాధి కల్పనకు నైపుణ్య గణన

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి : ఉపాధి అవకాశాల కల్పనకు నైపుణ్య గణన ఎంతో ఉపయోగపడుతుందని, ఈ సర్వేకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, పోలాకి మండలం గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి సోమవారం నిర్వహించిన నైపుణ్య గణనలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి తొలి అయిదు సంతకాల్లో నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్) ఒకటని, యువతకు అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టినట్లు తెలిపారు. ఇంజినీరింగ్, మెడికల్, ఫార్మసీ, డిప్లమా కళాశాలలను గుర్తించి అక్కడి విద్యార్థులకు నైపుణ్య గణన ప్రాముఖ్యతను వివరించి స్వీయ గణన చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి 15 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఒక్కరికీ సర్వే చేపట్టి డేటా సేకరించాలని, దీనిపై ఎవరికి ఎటువంటి సందేహాలున్నా నివృత్తి చేసి నైపుణ్య గణన ఉపయోగాలను వారికి ఓపిగ్గా వివరించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రవికుమార్, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కో-ఆర్డినేటర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న పిఒ యశ్వంత్ కుమార్‌రెడ్డి

ఐటిడిఎ ఏర్పాటు చేయాలి

172 వినతులను స్వీకరించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టిలో ఐటిడిఎ, పాలిటెక్నిక్ కళాశాల, పిహెచ్‌సిని సిహెచ్‌సిగా మారాలని మాజీ ఎంపిపిలు మాడుగుల రామారావు, బైరిసింగి లక్ష్మీనారాయణ, గిరిజన సంఘ నాయకులు అప్పన్న, శ్రీనివాసరెడ్డి తదితర సమస్యలపై విన్నవించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించలేదని పిఒ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పరిశీలించిన తరువాత ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులతో ఐదేళ్ల కిందట లక్షలాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన పనులకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులు ఎం.బుక్‌లో నమోదు చేయకపోవడంపై మండిపడ్డారు. బిల్లులు అందించాలని ఎఇ శ్రీకాంత్‌కు ఆదేశించారు. గ్రామాల్లోని సచివాలయాల ద్వారా తగు సేవలు అందడం లేదని, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని పలువురు పిఒ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా 172 ఫిర్యాదులను స్వీకరించారు. అధిక శాతం పోడుపట్టాలు మంజూరు చేయాలని, గిరిజన గ్రామాలకు తాగునీరు సరఫరా, రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజన సంఘ నాయకులు ప్రజాప్రతినిధులు విన్నవించారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ, డిఎల్‌పిఒ రెళ్లి గోపీబాల ఐటిడిఎ ఇఇ రమాదేవి, డిఇ సిమ్మన్న, మండల ప్రత్యేక అధికారి లింగాల మధుబాబు, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE ICHAPURAM.
O.S. 10/2024.

Between:
Dalli Devayya .....Plaintiff.
And:
Konagala Teja .....Defendant.

NOTICE TO THE DEFENDANT UNDER ORDER 5 RULE 20 C.P.C.

To,
Defendant;
Konagala Teja, S/o Konagala Dharmarao, aged about 40 years, Business, R/o Bellupada Colony Street, Ichapuram, Ichapuram Municipality, Srikakulam District, Andhra Pradesh.

Please take notice that the plaintiff has filed the above suit against you for recovery of money and the same is posted to **20-11-2024 for your appearance at 10-30 A.M.** before the Hon'ble Court of the Junior Civil Judge, Ichapuram and you are to appear in person or through Advocate, failing which the matter will be decided in your absence.

// By Court Order //

MONOJ KUMAR SAMONTO, ADVOCATE, ICHAPURAM, SRIKAKULAM DISTRICT, ANDHRA PRADESH.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఆర్మీ జవాన్ల రుణం తీర్చుకోలేనిది

ప్రజాశక్తి- పాతపట్నం

ఆర్మీ జవాన్ల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ఆర్మీ సైనికుల సంక్షేమ భవనంలో మాజీ సైనికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల పరిపాలనలో రాష్ట్రంలో మాజీ సైనికుల సంక్షేమానికి రూ.10 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే దేశ సరిహద్దుల్లో ఆర్మీ జవాన్లు ఉన్నారనే ధైర్యంతో మనం, మన కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండగలుగుతున్నామని చెప్పారు. భారతమాతకు ఎంతో ఇష్టమైన వారు జవాన్లేనని, ప్రతి భారతీయుడు గౌరవంగా సెల్యూట్ చేసేది ఆర్మీ వాళ్లకే అని అన్నారు. కార్యక్రమంలో సుబేదార్ రామారావు పాల్గొన్నారు.

వికలాంగుని వద్ద అర్జీ స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

సమస్యల పరిష్కారానికే 'ప్రజా వారధి'

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడానికే ప్రజా వారధి నిర్వహించడం జరుగుందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని 15 రోజుల్లో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, ఎంపిడిఒ ఈశ్వరరావు, విద్యుత్ శాఖ అధికారి తిరుపతిరావు, ఐసిడిఎస్ పిఒ ఝాన్సీ, పలు శాఖల అధికారులు, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, లెంక శ్యాం, పిన్నింటి భానోజీనాయుడు, పిసిని జగన్నాథం నాయుడు, శ్రీనివాసరావు, బస్వ గోవింద రెడ్డి, గొర్లె సాయి పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న వార్డు ప్రజలు

ఎమ్మెల్యే దృష్టికి బెల్లుపడ కాలనీ సమస్యలు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు బెల్లుపడ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబరు శేఖర్ మాట్లాడుతూ వార్డులో కొత్త రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని విన్నవించారు. తాగునీటికి వార్డు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని శేఖర్ తెలిపారు.

పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ గోపీబాల

సచివాలయం సందర్శన

మెళియాపుట్టి : మండలంలోని చాపర గ్రామ సచివాలయాన్ని టెక్కలి డిఎల్‌పిఒ రెల్లి గోపీబాల సోమవారం సందర్శించారు. ఈ మేరకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్నిశాఖల సిబ్బంది రికార్డు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో సమయపాలన కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రామకృష్ణ, కార్యదర్శులు చింతల అప్పారావు, శివాజీ, ఢిల్లేశ్వరరావు, మోహనరావు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

రైల్వే అధికారుల పరిశీలన

కోటబొమ్మాళి: మండలంలోని తిలారు రైల్వే పరిధిలో పలు సమస్యలు సంబంధిత ఎఎన్‌తో పాటు మరి కొంతమంది రైల్వే సిబ్బంది సోమవారం పరిశీలించారు. తిలారు అండర్ పాస్‌లో బిటి రోడ్డు నిర్మాణం, ఇటీవల వర్షాలకు గండి పడిన పెద్దచెరువు, అలాగే గవరమ్మపేట నుంచి పేటపాడు వరకు రోడ్డు నిర్మాణం తదితర పనులను పరిశీలన చేశారు. ఇటీవల కోటబొమ్మాళి మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ ఢిల్లీలో కేంద్ర పౌర విమానయశాఖమంత్రి, రైల్వే శాఖామంత్రిలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ మేరకు రైల్వే అధికారులు పరిశీలించారు.

'బాహుదా' ఛానల్ పరిశీలన

ఇచ్ఛాపురం: మండలంలోని బాహుదా నదిపై ఉన్న ఛానల్ దుస్థితిపై ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు గ్రామస్తులు, టిడిపి నాయకులు వినతిపత్రం అందజేశారు. సిఎం ఉన్నతాధికారులకు ఆదేశించడంతో లిఫ్ట్ ఇరిగేషన్ ఎఇ శ్రీనివాసరావు తన సిబ్బందితో బిర్లంగి, తెలుకుంచె బాహుదా ఛానల్ సోమవారం పరిశీలించారు. అధికారుల పరిశీలనకు వచ్చే సమయంలో పొలాల్లో నీరు లేకపోవడంతో రైతులు సొంత డబ్బులు వెచ్చించి మోటార్ల ద్వారా వరికి నీరు అందిస్తున్నారు. దీనిని లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. ఛానల్ అభివృద్ధి చేస్తే సాగునీరు అందుతుందని టిడిపి నాయకులు మెరుగు సూర్య నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, దక్కత శ్రీను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఛానల్ పరిస్థితిపై పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామని ఎఇ తెలిపారు. కార్యక్రమంలో రైతు మెరుగు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎఇ శ్రీనివాసరావు

హామీలు అమలైతే...!

ముఖ్యమంత్రి వరాల జల్లుపై పెరిగిన ఆశలు

ప్రజాశక్తి- కవిటి

ఇచ్ఛాపురం నియోజకవర్గం ఉద్దానంలో జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నియోజక వర్గానికి కీలక సమస్యలైన తాగునీరు, సాగునీరుతో పాటు దశాబ్దాలుగా నలుగుతున్న బెంతు ఒరియాల సమస్య, కొబ్బరి పార్కు ఏర్పాటు అంశాలపై వరాల జల్లు కురిపించారు. కంచిలిలో పాల్గొనిన స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ అధినేత వద్ద తన పట్టు నిలుపుకున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలయితేనే ఇచ్ఛాపురం సభకు అర్థం, నియోజకవర్గానికి ప్రాధాన్యత లభిస్తుందనేది వాస్తవం.

వంశధార, బాహుదా నదుల అనుసంధానం

జిల్లాలో వంశధార - బహుదా నదుల అనుసంధానం జరిగితే ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందనేది వాస్తవం. దీనికోసం వంశధార జలసాధన కమిటీ పేరుతో మేధావులు, రైతులు ఇప్పటికే పోరాటం కూడా చేస్తున్నారు. ఇటువంటి తరుణంలో ఎమ్మెల్యే అశోక్ వంశధార, బహుదా నదుల అనుసంధానం ద్వారా రైతులకు జరిగే మేలు వివరిస్తూ దానికి ప్రధాన సమస్య అయిన నేరడి ప్రాజెక్టు, పక్క రాష్ట్రమైన బిజెపి ప్రభుత్వంతో జరపాల్సిన సంప్రదింపుల గురించి విపులంగా వివరించారు. ఆ తరువాత మాట్లాడిన ముఖ్యమంత్రి బాహుదా నదిలో గ్రోయిన్లతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కోసం రూ.30 కోట్లు అవసరమవుతాయని, వాటిని మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే జరిగితే రైతులకు మేలు జరిగి పంటలు పుష్కలంగా పండుతాయనడంలో సందేహం లేదు.

బెంతు ఒరియాలకు ఉపశమనం

ఇక దశాబ్దాలుగా నలుగుతున్న బెంతు ఒరియాల సమస్యకు తాత్కాలిక ఉపశమనం లభించనుంది. ముఖ్యమంత్రి మాట్లాడుతూ బెంతు ఒరియాల సమస్య ఎప్పటినుంచో ఉందని, దానికి శాశ్వత పరిష్కారం కోసం ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అయితే ప్రస్తుతం బెంతు ఒరియా విద్యార్థుల చదువులు, ఇతరత్రా అవసరాలకు ఇబ్బంది లేకుండా తక్షణమే వారికి నేటివిటీ ధ్రువపత్రాలను మంజూరు చేస్తామని చెప్పడంతో బెంతు ఒరియా విద్యార్థులు, యువతకు ప్రప్రథమంగా మేలు జరగనుంది. దీనిపై వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొబ్బరి పార్కు కోసం సేకరించిన స్థలం (ఫైల్)

తెరపైకి కొబ్బరి పార్కు

మరోవైపు ఉద్దానం రైతాంగాన్ని ఎప్పటినుంచో ఊరిస్తున్న కొబ్బరి పార్కు ఏర్పాటు మరో తెరపైకి వచ్చింది. ఎమ్మెల్యే అశోక్ రైతుల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి కొబ్బరి పార్కు ఏర్పాటు ఆవశ్యకత వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి కొబ్బరి పార్కు కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో కొబ్బరి పార్కు ఏర్పాటుకు బీజాలు పడి, రూ.50 కోట్లతో ప్రతిపాదన సిద్ధం చేసి నివేదికలు పంపించినా కొన్ని అనివార్య కారణాలవల్ల ఈ అంశం మరుగున పడింది. మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్యే అశోక్ చొరవతో తరపైకి వచ్చిన కొబ్బరి పార్కు ఏర్పాటయితే కొన్ని వేల కుటుంబాలకు ఉపాధి లభించడమే కాకుండా వలసల నివారణలో కీలక పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదు.

సాగునీరందించడంలో విఫలం

సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం

అధికారులను నిలదీస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- జి.సిగడాం

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి మీసాల సత్యవతి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు తమ నివేదలను చదివి సభ్యులకు వినిపించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై చర్చించారు. మండలంలో మడ్డువలస కాలువ ద్వారా 7,500 ఎకరాలకు నీరందక రైతులు ఇబ్బందులు పడ్డారని, రైతుల బాధలు, సమస్యలు మీకు పట్టవా అంటూ వాండ్రంగి, ఆనందపురం, సంతవురిటి, ధవలపేట, పెంట, సీతంపేట, టిడివలస, పాలఖండ్యాం, మెట్టవలస, నిద్దాం గ్రామాలకు సాగునీరు అందించడంలో నీటిపారుదల శాఖాధికారులు విఫలమైయ్యారని, ఎన్ని వినతులు ఇచ్చినా అధికారుల్లో చలనం లేదని సర్పంచ్ సాకేటి నాగరాజు, బుడారి లక్ష్మణరావు, చిత్తి మంజు, బురాడ శ్రీదేవి, ధారబోయిన రెయ్యమ్మ, గేదెల వరలక్ష్మీ, గేదేల మల్లిబాబు, పున్నాన సోనియా, మీసాల రవి అధికారులను నిలదీశారు. గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ ఇంటింటి కొళాయిలు పనులు పూర్తిస్థాయిలో చేయక రోడ్లు తవ్వి కాంట్రాక్టర్లు మధ్యలో అధ్వాన్నస్థితిలో వదిలేశారని, ప్రజాప్రతినిధులుగా గ్రామాల్లో తిరగలేక పోతున్నామని జెడ్‌పిటిసి సభ్యుడు కాయల రమణ, పాలఖండ్యాం సర్పంచ్ రెయ్యమ్మ మండిపడ్డారు. ఎంఇఒ ముళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 62 పాఠశాలల్లో ఎస్ఎంసి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న చెత్త సంపద కేంద్ర పనులను బలవంతంగా అధికారులు తమతో చేయించారని ఇంతవరకు బిల్లులు చెల్లించలేదని గొబ్బూరు సర్పంచ్ మహాదాస్యం చిన్నారావు సభ దృష్టికి తీసుకువచ్చారు.

వ్యవసాయ అధికారులు రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు తీసురావడంలో విఫలం చెందారని, ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో ఎక్కువ ధరలకు ఎరువులు అమ్ము తున్నారని జాడ ఎంపిటిసి పెద్ది శ్రీను, పాలఖండ్యాం సర్పంచ్ దారిబోయిన రెయ్యమ్మ సభ దృష్టికి తీసుకువచ్చారు.మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్ ఎంపిపి మీసాల స్వాద్వీమణి, తోలేటి వెంకట్రావు, ఎంపిడిఒ రామ కృష్ణ, గాయత్రి, ఎపిఎం రెడ్డి రామకృష్ణ, విద్యుత్‌శాఖ ఎఇ దుర్గాప్రసాద్, పశువైద్యాధికారి సునీల్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అపరాలు అందించాలి

నందిగాం : రానున్న రబీ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని రైతులకు పెసర, మినుము విత్తనాలు సబ్సిడీపై అందించాలని సిపిఎం మండల కార్యదర్శి పోలిన సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో అనుకున్న స్థాయిలో పంటలు సాధించలేకపోయారని అన్నారు. చీడపీడల బారిన పడడంతో కొంతమేర నష్టపోయారని పేర్కొన్నారు. దానిని అధిగమించేందుకు రబీ సీజన్‌లో సబ్సిడీపై విత్తనాలు అందించి వరి పైరు వేసుకునేందుకు వంశధార కాలువ ద్వారా ఫిబ్రవరి నెలాఖరి వరకు పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

రేపు జాబ్‌మేళా

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 6న జాబ్‌మేళా నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం పది గంటలకు నిర్వహించబోయే ఈ జాబ్‌మేళాలో 4 సంస్థలు పాల్గొనున్నాయన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. కళాశాల జెకెసి ఆధ్వర్యాన ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

మందస : మండలంలోని హరిపురం మార్పు ట్రస్టు గ్రంథాలయంలో అంధత్వ నిర్మూలన సంస్థ సౌజన్యంతో మార్పు పద్మనాభం మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యాన శ్రీకాకుళం శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి వైద్యులు సోమవారం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్ర వైద్యాధికారి జె.పవిత్రి 110 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అందులో 45 మందికి కంటి ఆపరేషన్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో క్యాంప్ ఇన్‌ఛార్జి టి.రామారావు, మార్పు పద్మానాభం మెమోరియల్ ట్రస్టు గౌరవాధ్యక్షులు మట్ట ఖాగేశ్వరరావు సన్నశెట్టి రాజశేఖర్ పాల్గొన్నారు. కమిటీ సభ్యులు రోగులకు మజ్జిగ, తాగునీరు, పులిహోర పంపిణీ చేశారు.

వినతులు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

త్వరితగతిన సమస్యల పరిష్కారం

లావేరు: రీసర్వే జరిగిన గ్రామాల్లో భూసమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని తహశీల్దార్ ఎన్ని జోగారావు అన్నారు. సోమవారం సుబద్రాపురం, చెల్లయ్యమ్మ అగ్రహారం గ్రామాల్లో రీసర్వే సమస్యలపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భూసమస్యలుంటే వినతిపత్రాలు అందజేస్తే పరిష్కరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిటి ఎన్.తిరుపతిరావు, మండల సర్వేయర్ బి.శ్రీధర్ రెడ్డి, సచివాలయల సిబ్బంది, విఆర్‌ఒలు, రైతులు పాల్గొన్నారు.

అక్కమాంబతల్లిని దర్శించుకుంటున్న ప్రమీల

ఘనంగా అక్కమాంబతల్లి బోనాలు

పొందూరు: నాగవంశం సామాజికవర్గం కులదేవత, పొందూరు గ్రామ దేవత అక్కమాంబతల్లి బోనాలు ఉత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. నాయుడు వీధి నుంచి బోనాలను డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా వందలాది మంది భక్తులతో అక్కమాంబ ఆలయానికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా భారీగా బాణాసంచా కాల్చారు. అక్కమాంబతల్లి అమ్మవారిని పలు ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల దర్శించుకున్నారు. వీరివెంట మండల పార్టీ అధ్యకులు రామ్మోహన్, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, గ్రామపెద్దలు తదితరులున్నారు.

లచ్చయ్యపేట భూములపై విచారణ చేపట్టాలి

గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేస్తున్న గాంధీ తదితరులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని లచ్చయ్యపేట గ్రామానికి సంబంధించిన భూములను జిల్లాస్థాయి అధికారితో విచారణ చేపట్టాలని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. లచ్చయ్యపేట భూములను ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో చేర్చడం వలన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. లచ్చయ్య పేట గ్రామ రైతు భూములను రిసర్వేలో ప్రభుత్వ భూములుగా రికార్డుల్లో అధికారులు చూపారన్నారు. 2023లో రీసర్వే చేయడం జరిగిందని, రీసర్వేలో 146 మందికిపైగా రైతుల భూములను ప్రభుత్వ భూములుగా చూపించారని, అయితే రైతులకు ఆ భూములు వారి పూర్వీకుల నుంచి మరికొందరికి, రిజిస్టర్ మూలంగా సంక్రమించాయని, 1995లో వారి గ్రామంలో అగ్ని ప్రమాదం జరగడం వలన భూ సర్వే చేసి సదరు సర్వేలో రైతుల యొక్క భూములను వారి పేరు నమోదు చేశారన్నారు. రీసర్వే జరగడానికి ముందు వరకు ఆ భూములు వారి పేరు పైన 1బి, అడంగల్ కూడా వచ్చేవని, పై అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా సదరు భూములు రీ సర్వే అనంతరం రిజిస్ట్రేషన్‌లు నిలిపి వేశారని, ఈ విషయంపై జిల్లాస్థాయి అధికారితో విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఆయనతో పాటు నీలకంఠం, గిరడ జగన్ మోహనరావు, కొంచాడ మన్మథరావు, సెయిరిగాపు శ్రీను, వెంకటరావు, కొంచాడ సీతం నాయుడు, జన, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వలసలు నివారించి మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం సింగుపురం పంచాయతీ మామిడివలసలో సోమవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వంద శాతం రాయితీపై చేపలను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. స్వదేశీ మత్స్యసహకార సంఘాలకు, పిఎంఎంఎస్‌వై సంఘాలకు ఈ చేప పిల్లలను పంపిణీ చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలో మత్స్యకారులను ఆదుకునేందుకు అనేక సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు వివరించారు.

గ్రామసభల్లో భూ సమస్యల పరిష్కారం

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తుందని, రైతులు వాటిని వినియోగించుకోవాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం గేదెలవానిపేటలో సోమవారం రెవెన్యూ గ్రామ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సర్వేలో జరిగిన లోపాలు ఉన్నట్లయితే రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రీ సర్వేలో పొరపాటులను సరిదిద్దుందుకే రెవెన్యూ సభలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ చట్టం తెచ్చి భూ యజమానుల నుంచి భూమిని కాజేసేందుకు పన్నాగం చేసిందన్నారు. సమస్యకు సంబంధించి అవసరమైతే ఫీల్డ్‌కి వచ్చి సంబంధిత సమస్య పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. సర్వేయలందరూ క్షేత్రస్థాయికి వెళ్లి సర్వేలు నిర్వహించాలని సూచించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లలను విడిచిపెడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఉద్యోగ భద్రత కల్పించాలి

ధర్నా చేస్తున్న మద్యం దుకాణాల ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 3,600 ప్రభుత్వ మద్యం షాపులను ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియామకాలు చేపట్టారని, ప్రస్తుత ప్రభుత్వం నూతన మద్యం పాలసీ వలన వారంతా ఉపాధి కోల్పోయారని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి ఆధ్వర్యాన ధర్నా చేపట్టారధీ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా కష్టపడి పనిచేశారని, వారిని ప్రభుత్వ శాఖల్లో కొనసాగించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు డోల శంకరరావు, చిక్కాల గోవిందరావు, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు, ఎపి స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కీర్తి ధర్మారావు, బొత్స సంతోష్, పోగోటి వాసుదేవరావు, బత్తిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అభివృద్ధికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సంస్కృత ప్రధాన అధ్యాపకులుగా పని చేస్తున్న డాక్టర్ వమ్మి రామారావు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన వీడ్కోలు సభ కళాశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రామారావు 32 ఏళ్ల పాటు అధ్యాపకునిగా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారన్నారు. అధ్యాపకునిగా పాఠాలు బోధించడమే కాకుండా తన ప్రతినెలా జీతంలో కొంత భాగం పేద విద్యార్థులకు సహాయం చేశారని వైస్ ప్రిన్సిపాల్ వి.సత్యనారాయణ పేర్కొన్నారు. సంస్కృత విభాగంలో ప్రథమస్థానం పొందిన విద్యార్థులకు బహుమతి నిమిత్తం రూ.35 వేల చెక్కును అందజేశారు. ఏడాది పాటు వచ్చే వడ్డీతో ప్రతిఏటా ఉత్తమ విద్యార్థికి బహుమతి అందజేయనున్నారు. అలాగే కళాశాలలో కొత్త ఫ్యానుల కొనుగోలుకు రూ.15 వేల చెక్కును ప్రిన్సిపాల్‌కు అందజేశారు.

చెక్కును స్వీకరిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- కొత్తూరు

సింహాచలం మృతదేహం

మండలంలోని వసప వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నివగాంకు చెందిన నూలు సింహాచలం (51) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నివగాం నుంచి కొత్తూరు బైక్‌పై సింహాచలం వస్తుండగా... వసప వద్ద వాహనాన్ని వెనక్కి మళ్లించాడు. ఈ సమయంలో పొగ మంచు కురుస్తుండడంతో ఒడిశా రాష్ట్రం హడ్డుబంగికి చెందిన మరో ద్విచక్ర వాహనదారుడు గమనించకుండా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సింహాచలం తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు ఆటోలో కొత్తూరు సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య పద్మ, కుమారులు అఖిల్, నిఖిల్ ఉన్నారు. మృతుడి భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.అహ్మద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి- జి.సిగడాం

చికిత్స అందిస్తున్న 108 సిబ్బంది

మండలంలో జి. సిగడాం నుంచి నరసింహ పురం మధ్యలో రైల్వేట్రాక్ పక్కన ఒడిశా వాసి పడి ఉండడంతో అటుగా పని చేస్తున్న రైల్వే ట్రాక్‌మేన్ ఆయనను గుర్తించి 108కు సమా చారం అందించారు. ఒరిస్సాలో గంజాం జిల్లాకు చెందిన హెన్నాగౌడ్‌గా ట్రాక్‌మేన్ ఆయన వివరాలు తెలుసుకున్నాడు. 108 ఘటనా స్థలం వరకు వెళ్లలేకపోవడంతో మూడు కిలోమీటర్ల మేర ట్రాక్ వెంబడి నడుచుకొని వెళ్లి బాధితున్ని స్థానికుల సహకారంతో 108 ఎక్కించారు. 108 సిబ్బంది దాలినాయుడు, సతీష్ కుమార్ ప్రథమ చికిత్స చేసి అనంతరం జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలు అనుసంధానం చేయాలి

ప్రజాశక్తి- బూర్జ

మాట్లాడుతున్న విశ్వప్రసాద్

మండలంలోని ఒనిగడ్డ ఛానల్‌ను తోటపల్లి కాలువకు అనుసంధానం చేసేందుకు సిఎం చంద్రబాబు నాయుడు చొరవ చూపాలని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒనిగడ్డ ఛానల్ ద్వారా బూర్జ మండలంలోని 7,800 ఎకరాలకు సాగునీరు అందేదన్నారు. అయితే వైసిపి ప్రభుత్వ హయాంలో 28 పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాలకు సాగునీరు అందించే ఈ ఛానల్ పరిధిలో ఉన్న 103 కాల్వలకు సంబంధించి నాలుగేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో కాలువలో జంగిల్ పెరిగిపోయి, పూడికలు పేరుకుపోవడంతో సాగునీరు అందడం లేదన్నారు. దీనివలన రైతులు పూర్తిగా నష్టపోతున్నారన్నారు. తోటపల్లి కాలువకు అను సంధానం చేస్తే రైతులకు సాగునీరు అందుతుందన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పి ధరలకు మించి అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు చేపడుతామని సిఐ వై.రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం బ్రాండ్లకు సంబంధించి ఎంఆర్‌పి ధరల పట్టికను దుకాణాల వద్ద ఏర్పాటు చేశామని, ఆ ధరలను మించి మద్యం విక్రయిస్తే సంబంధిత దుకాణాలపై చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న గణపతి

రోడ్డు నిర్మించాలని వినతి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని గొల్లూరు పంచాయతీ దామోదరపురం, కొర్లాం పంచాయతీలోని లక్ష్మీపురం నుంచి బేసి రామచంద్రపురం, కంచిలి మండలంలోని బూరగం జాతీయ రహదారి నుంచి రైల్వే గేట్ వరకు రహదారి నిర్మాణాలు చేపట్టాలని జాగృతి అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు గణపతి తెలిపారు. కార్యక్రమంలో జాగృతి సభ్యులు ఆర్.జానకిరావు, ఎస్.ఢిల్లేశ్వరరావు, ఎన్.బలరాం పాల్గొన్నారు.

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి- మందస

మండలంలోని జి.ఆర్.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీకాకుళం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తరుపున అండర్-14 కేటగిరిలో అథ్లెటిక్స్ విభాగంలో డిస్కస్‌త్రో, వాలీబాల్ పోటీల్లో ప్రతిభకనబర్చారు. డిస్కస్‌త్రో విభాగంలో దుంపల సోనీ ప్రియ, అండర్-14 కేటగిరిలో త్రోబాల్‌లో దేశెట్టి ప్రతాప్, అండర్-17 కేటగిరిలో త్రోబాల్ విభాగంలో బేసి.హర్షవర్ధన్‌లు రాష్ట్రస్థాయిలో జరగనున్న ఎస్‌జిఎఫ్ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 6న ఏలూరులో జరుగుతున్న పోటీల్లో పాల్గొనడానికి సోమ వారం బయలుదేరి వెళ్లారు. వీరికి హెచ్‌ఎం ఎస్.ఎర్రన్నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు టి.గీత, ఉపాధ్యాయులు అభినందించారు.

కేన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

పొందూరు: కేన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ, ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్యులు బి.తరుణ్ అన్నారు. సోమవారం మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శశిధర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్ రోజురోజుకు పెరుగుతోందని దీనిపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముందు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారానే కేన్సర్ వ్యాప్తిని నిరోధించవచ్చన్నారు. కేన్సర్ వ్యాప్తిని అరికట్టడానికి ఆడపిల్లలు వ్యాక్సిన్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 205 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో హెచ్ఎం బి.కంటయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షణ్ముఖ మాస్టర్‌కు బహుమతుల పంట

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సోమవారం నిర్వహించిన జిల్లా సాంస్కృతిక పోటీల్లో మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు షణ్ముఖ మాస్టర్ మూడు బహుమతులు కైవసం చేసుకున్నారు. టీచర్-2040 ఎడి నాటికకు మొదటి, అభ్యుదయ గీతాల్లో రెండు, మిమిక్రీలో రెండవ స్థానాల్లో గెలుపొంది సత్తా చాటారు. అలాగే పౌరాణిక పద్యాల్లో రెండో బహుమతి పొందిన ఆర్.నీలం, జానపద నృత్యంలో మొదటి బహుమతి పొందిన బి.చిన్నారావు మాస్టర్‌లను కోటబొమ్మాళి యుటిఎఫ్‌శాఖ, ఉపాధ్యాయులు అభినందించారు.

బాధితులకు పరామర్శ

కోటబొమ్మాళి: దళితులైన అప్పలరాజు, దమయంతిలపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన నిందితులు అందరిపైనా హత్యానేరం కేసులు నమోదు చేయాలని జిల్లా దళిత సంఘాల జెఎసి నాయకులు అన్నారు. మండలం కిస్టుపురంలో దళితులపై పెత్తందారులు దాడి చేసి గాయపడిన బాధిత కుటుంబాలను కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రిలో సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల గోపి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజా శ్రీను, సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్ పాల్గొన్నారు.

శ్రీకాంత్ పరామర్శ

పాతపట్నం : మండలంలోని పెద్దలోగిడికు చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు బైపోతు అప్పలరాజు కిడ్నీ వ్యాధి బాధపడుతున్నారు. విశాఖపట్నంలోని మెడికేర్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు మామిడి శ్రీకాంత్ సోమవారం వెళ్లి పరామర్శించారు. ఈయనతో వైసిపి నాయకులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

టెక్కలి; టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న పొలం దుర్గామల్లేశ్వరరావు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు నాగభూషణం సోమవారం తెలిపారు. ఈ నెల 6 నుంచి 8వ వరకు కడప జిల్లా అంగూరు జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో జరగబోయే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు హాజరవుతారని చెప్పారు. విద్యార్థి ఎంపికకు కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మలను హెచ్ఎం అభినందించారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

వజ్రపుకొత్తూరు: టిడిపి ప్రభుత్వం హయంలో గ్రామీణ రహదారుల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి కొనారీ కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని రెయ్యిపాడు పంచాయతీలో కొండవూరు నుంచి రెయ్యిపాడు వరకు తారు రోడ్డు నిర్మాణానికి ఎంపిటిసి శాల చిట్టిబాబుతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు కిలోమీటర్లు తారు రోడ్డు నిర్మాణం రూ.1.50 కోట్లతో చేపడుతున్నట్లు తెలిపారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో రోడ్డు పనులు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కోనారి మల్లేష్, కీలు మాధవరావు, సూక్ల శాంతారావు, కీలు ఎర్రన్న, వెంకటస్వామి, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు కిటకిట

టెక్కలి రూరల్ : దర్శనానికి బారులుతీరిన యాత్రికులు

టెక్కలి రూరల్ : కార్తీకమాసం మొదటి సోమవారం మండలంలోని రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. ఒడిశా రాష్ట్రం, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. జిల్లానుండే కాకుండా ఒరిస్సా రాష్ట్రం నుండి సైతం అధిక సంఖ్యలో యాత్రికులు సందర్శించారు. వేకువజామున 3 గంటల నుంచే క్యూలైన్‌లో వేచి ఉన్నారు. నార్ల కృష్ణారావు యాత్రికులకు ఉచితంగా ప్రసాదం పంపిణీ చేశారు. బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన పులిహోర అందజేశారు. ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి గురునాథరావు, సిఐ విజయకుమార్ పర్యవేక్షించారు.

కోటబొమ్మాళి: కార్తీక మాసంలో మొదటి సోమవారం స్థానిక ఉమా మల్లేశ్వరస్వామి, కొత్తపేటలోని శివకేశవ పంచాయతన క్షేత్రంలో ఆలయాలకు యాత్రికులు తరలివచ్చారు. ప్రధాన అర్చకులు బి.గౌరీశంకరశర్మ పూజలు నిర్వహించారు. అలాగే సుబ్బారావుపేట, చవితిపేట, చిట్టేవలస, దంత, లఖందిడ్డి, యలమంచిలి తదితర గ్రామాల్లో శివాలయాల్లో కిటకిటలాడాయి.

రణస్థలం: కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా మండలంలోని రణస్థలం, జె.ఆర్.పురం, కొండములగాం, సంచాం, పాతర్లపల్లి, కోటపాలెం, కొచ్చెర్ల, తదితర శివాలయాలకు భక్తులు పోటెత్తారు.యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రధాన ఆలయాల్లో తెల్లవారుజామున 5 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిరంతర దర్శనం కల్పించడానికి ఆలయ అర్చకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

మాజీ ఎమ్మెల్యేకి నివాళి

మందస: ఉద్దానం ప్రాంత ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించిన ప్రజానాయకుడు పలాస మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్ అన్నారు. మండలంలోని భేతాళపురంలో సర్పంచ్ సింహాద్రి ఆధ్వర్యాన జగన్నాథకులు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలు పెట్టి పలాస నియోజకవర్గంలో కీలక సామాజిక తరగతిగా ఉన్న మత్స్యకార అగ్నికుల క్షత్రియ తరగతి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని అన్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి దున్న హరికృష్ణ, జిల్లా అగ్నికుల క్షత్రియ అధ్యక్షుడు మడియా రామకృష్ణ, విగ్రహ దాత తాడల అప్పలస్వామి పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో విస్తృత అవకాశాలు

నరసన్నపేట: బ్యాంకింగ్ రంగంలో విస్తృత అవకాశాలు ఉన్నాయని ఈ రంగంలో ప్రవేశించిన వారు తమ సామర్థ్యం, అనుభవం ఆధారంగా అత్యున్నత స్థానాలకు చేరుకోవచ్చని పోటీ పరీక్షల నిపుణులు ఎం.వి.ఎస్. సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ రంగంలో అవకాశాలపై సోమవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగం ప్రారంభించిన వారు సీనియర్ మేనేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అన్నారు. డిగ్రీ చదువుతుండగా పోటీ పరీక్షలపై అవగాహన కలిగి ఉండి ప్రాథమిక అంశాలు తెలుసుకోవాలని సూచించారు. బ్యాంకింగ్ రంగ నేపథ్యానికి సంబంధించిన నాలెడ్జ్ కోసం ఒక ఫైనాన్షియల్ డైయిలీని కూడా చదవాలని తెలియజేశారు. కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, అకడమిక్ ఇన్‌ఛార్జి ముకల్ల శ్రీనివాసరావు, హిస్టరీ అధ్యాపకులు పద్మనాభం, కె.రాము పాల్గొన్నారు.

పంటల బీమా తప్పనిసరి

కవిటి: ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో పంటల బీమా పథకం రైతులను ఆదుకుంటుందని ఉద్యానవన శాఖ అధికారి పోలాకి మాధవీలత తెలిపారు. మండలంలోని చండిపుట్టుగ, బైరిపురం గ్రామాల్లో పంటల బీమా పథకంపై సోమవారం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ ఆధారిత పంటల బీమా కింద జీడి, మామిడి పంటలకు బీమా చెల్లించేలా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. అందులో భాగంగా జీడి, మామిడి రైతులు హెక్టారుకు రూ.4వేలు, ఎకరాకు రూ.1600లు చెల్లించి బీమా పొందాలని సూచించారు. నవంబరు 15, 2024 తేదీల్లోగా దగ్గర్లోని మీసేవ కేంద్రాల్లో బీమా చెల్లించి రైతులు తమ పేర్ల నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నైపుణ్య గణనపై సచివాలయ ఉద్యోగులకు సోమవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ వి.తిరుమలరావు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ తేజేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ బి.రమేష్ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఇంట్లోని యువతకు విద్య, నైపుణ్యాల ఆధారంగా ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందించే ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకునేందుకు ఈ సర్వే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపిఎం ప్రసాదరావు, కార్యదర్శులు, విఐఎలు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ తిరుమలరావు

బిజెడి నాయకుల పాదయాత్ర

మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి- పర్లాకిమిడి

మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, హెల్త్ కార్డులు బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని బిజెడి రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ నాయక్, ఎమ్మెల్యేలు తిరుపతి పాణిగ్రహి, రూపేష్‌పాణిగ్రహి ఆరోపించారు. సీతపురంలో పాదయాత్ర ప్రారంభించి కాశీనగర్ సమితిలోని గోరిబంద వద్ద సోమవారం ముగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయడం లేదన్నారు. వృద్ధులకు రూ.3,500 ఇస్తామని ఓట్లు వేయించుకుని, ఇప్పుడు మొండిచేయి చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షులు గవర తిరుపతిరావు, కాశీనగర్ సమితి అధ్యక్షులు బల్ల సాయమ్మ, కాశీనగర్ ఎన్ఎసి ఉపాధ్యక్షులు రఘురాం సాహు,బోసంత్ దాస్, బిజెడి యువజన సంఘం అధ్యక్షులు లింగరాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎంసి చైర్మన్ నాగరాజు

తల్లిదండ్రులకు అవగాహన

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలం, మధుపాం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎన్‌వైకె యూత్ కో-ఆర్డినేటర్, ఎస్ఎంసి చైర్మన్ కామర్స్ నాగరాజు అధ్యక్షతన బెజ్జిపురం యూత్ క్లబ్ నిర్వహణలో ఎస్ఎంసి సభ్యులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాహక్కు చట్టం సమర్థవంతంగా అమలుకు విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయుటకు పేరెంట్స్ కమిటీ ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. నిధుల వినియోగం, పర్యవేక్షణపై చర్చించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్త, యూత్ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ శ్రీనివాసరావు

చట్టాలపై అవగాహన అవసరం

పోలాకి : చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని నరసన్నపేట సిఐ జె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గుప్పిడిపేటలో ఎస్ఐ జి.రంజిత్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి చట్టాలపై అవగాహన కల్పించారు. యువత చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

విత్తనాలను పంపిణీ చేస్తున్న అజయ్‌కుమార్

వేరుశనగ విత్తనాల పంపిణీ

నందిగాం : నందిగాం రైతు సేవా కేంద్రంలో వేరుశనగ విత్తనాలను టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ సోమవారం పంపిణీ చేశారు. సబ్సిడీపై అందిస్తున్న వేరుశెనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేరుశనగ, మినుము విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఎఒ పి.శ్రీకాంత్‌వర్మ తెలిపారు. పోలాకి చంద్రశేఖరరావు, ప్రసాదరావు, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

నిలిచిన ఆర్‌టిసి బస్సు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండి బస్టాండ్‌లోని ఆర్‌టిసి బస్ రహదారిపై అడ్డంగా సోమవారం నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పలాస నుంచి వస్తున్న టెక్కలి డిపోకు చెందిన స్టూడెంట్స్ స్పెషల్ బస్సు ఒక్కసారిగా మొరాయించింది. విద్యార్థులు బస్సును తోసినా కదలలేదు. దీంతో విద్యార్థులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించారు. రోడ్డుకు అడ్డంగా బస్సు నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

లక్కుపురంలో అన్నదానం

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామ శివాలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో శివాలయానికి వచ్చిన భక్తుల కోసం గ్రామానికి చెందిన బెవర సూరప్ప నాయుడు కుటుంబసభ్యులు మూడు వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పాలవలస, లక్కు పురం, వై.పర్ర, పనుకుపర్ర, రామన్నపేట ప్రజలు పాల్గొన్నారు.